
తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
హైదరాబాద్
రంగారెడ్డి - మేడ్చల్
ఆదివారం 8 ఫిబ్రవరి 2026
పేజీలు: 3



## సైబర్ నేరాలపై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

సైబర్ క్రైమ్ కేసులను విజయవంతంగా ఛేదించిన పోలీసులు



2లో

# ఎఫ్ఎస్ఎల్‌లో భారీ అగ్ని ప్రమాదం

- పూర్తిగా కాలిపోయిన పలు కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు
- ఐదు ఫైరింజన్లు, ఒక రోబోతో మంటలు అదుపులోకి..
- ప్రమాదంలో ఆఫీస్ బాయ్‌కి అస్వస్థత.. ప్రభుత్వాస్పత్రికి తరలింపు
- సురక్షితంగా బయటపడ్డ మరో ముగ్గురు ఉద్యోగులు
- షార్ట్‌సర్క్యూట్‌తోనే మంటలు: డీసీపీ శిల్పవల్లి
- భవనంలో అత్యంత కీలకమైన మొదటి అంతస్తులో ప్రమాదంపై భిన్నాభిప్రాయాలు
- ఓటుకు నోటు కేసులో ఆధారాలు మాయం చేసేందుకే..: కేటీఆర్
- ప్రమాదంపై అనుమానాలు వ్యక్తంచేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




**రాష్ట్ర రాజధానిలోని తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఎ (టీజీ ఎఫ్ఎస్ఎల్)లో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పెద్దఎత్తున ఆస్తినష్టం సంభవించింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటనలో పలు కీలక కేసుల ఫైళ్లు, కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు అగ్నికి ఆహుతయ్యాయి. ఎఫ్ఎస్ఎల్ భవనం మొదటి అంతస్తులో జరిగిన ఈ ప్రమాదంలో దాదాపు 50 కంప్యూటర్లు, తీవ్రమైన నేరాల్లో పోలీసులు సేకరించిన సాంకేతిక ఆధారాలు, సీజ్ చేసిన హార్డ్‌డిస్కులు, కేసు రికార్డులు పూర్తిగా దగ్ధమయ్యాయి.**

హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు, ఎమ్మెల్యేల కొనుగోలు కేసుతోపాటు ఇటీవల దర్యాప్తు కొనసాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు సైతం కాలి బూడిదైనట్టు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు చర్లపల్లి రైల్వే ట్రాక్‌పై ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయశాంతిరెడ్డి కేసులో ఆమె వినియోగించిన మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్షల కోసం ఉన్నట్లు తెలిసింది. ఇలాంటివే ఇటీవలి కాలంలో వివిధ కేసుల్లో సేకరించిన ఫింగర్ ప్రింట్స్, బ్లడ్‌శాంపిల్స్, హార్డ్‌డిస్కులు, సెల్‌ఫోన్లు, ఆడియో, వీడియో రికార్డులకు సంబంధించిన సీజ్డ్ ప్రాపర్టీ భద్రంగా ఉందా..? లేదా అగ్ని ప్రమాదంలో కాలిపోయిందా? అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. రెండు అంతస్తులున్న ఈ భవనం మొదటి అంతస్తులోనే ఆధారాలను భద్రపర్చేగదితోపాటు, పలు కేసుల్లో ఆధారాల విశ్లేషణ తర్వాత నివేదికలను భద్రపరుస్తారు. రెండో అంతస్తులో ఫోరెన్సిక్ పరికరాలు, కెమికల్ ల్యాబ్ మెటీరియల్ ఉంటుంది. ఈ ల్యాబ్‌లోకి మంటలు వ్యాపించలేదు. అలాగే కింది అంతస్తులోకి మంటలు పోలేదు. ప్రమాదంలో కేవలం ఒకటో అంతస్తు పూర్తిగా దగ్ధమవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.




2లో

## ట్రాఫిక్ మార్షల్స్ భద్రతకు పెద్దపీట

## తీవ్రమైన కేసుల్లో శిక్షా శాతం మరింత పెరగాలి

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం. రమేష్



3లో

# ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

## ఐడిఏ బొల్లారం ఇన్స్పెక్టర్ రవీందర్‌రెడ్డి






అక్షర గళం, ఐడీఏ బొల్లారం : ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఐడిఏ బొల్లారం ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డపోతారం గ్రామంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఐడీఏ బొల్లారం పోలీస్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది కలిసి గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ మాట్లాడుతూ శాంతిభద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడానికి , విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని పేర్కొన్నారు.

# పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ఆర్ఎన్‌సీ హాస్పిటల్ ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సి. రమేష్








అక్షర గళం, బాలానగర్ : నిరంతరం పని ఒత్తిడిలో ఉండే పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎన్‌సీ హాస్పిటల్ ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సి. రమేష్ సూచించారు. శనివారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులకు 'స్ట్రోక్ (పక్షవాతం) – నివారణ మార్గాల' పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక అంశాలను వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ఎదుర్కొనే మానసిక, శారీరక ఒత్తిడి వారిని స్ట్రోక్ బారిన పడేలా చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. స్ట్రోక్ వచ్చే ముందు కనిపించే ప్రాథమిక సంకేతాలను ఎలా గుర్తించాలో వివరించారు. స్ట్రోక్ వచ్చిన మొదటి కొన్ని గంటలు అత్యంత కీలకమని, సకాలంలో చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం, సరైన విశ్రాంతి ద్వారా స్ట్రోక్ ముప్పును ఎలా అరికట్టవచ్చో వివరించారు. బాలానగర్ సిఐ నర్సింహా రాజు మాట్లాడుతూ సిబ్బంది ఫిట్‌నెస్‌పై ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఈ సదస్సులో ఎస్ఐలు సరితా రెడ్డి, హాజీ మియా, వినోద్ కుమార్, జిన్నోవా బయోఫార్మ ప్రతినిధులు నవీన్, ప్రశాంత్, ఆర్ఎన్‌సీ హాస్పిటల్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

## సైబర్ క్రైమ్ కేసులను విజయవంతంగా ఛేదించిన పోలీసులు



అక్షర గళం, సైబరాబాద్ : సైబర్ నేరాలపై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం మోపారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 5 వరకు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తులో భాగంగా మొత్తం 9 సైబర్ క్రైమ్ కేసులను విజయవంతంగా ఛేదించి, దేశంలోని పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 12 మంది నిందితులను అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం....... ఈ అరెస్టుల్లో అత్యధికంగా 7 అరెస్టులు ట్రేడింగ్ మోసాలకు సంబంధించినవని తెలిపారు. మొత్తం కేసుల్లో ట్రేడింగ్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, పార్ట్‌టైం జాబ్ ఫ్రాడ్, మ్యాట్రిమోనీ ఫ్రాడ్ వంటి వివిధ రకాల సైబర్ నేరాలు ఉన్నట్లు వెల్లడించారు.అదే సమయంలో బాధితులకు ఊరట కలిగించే విధంగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, సైబరాబాద్ 58 కేసుల్లో 406 రిఫండ్ ఆర్డర్లను సాధించిందని డీసీపీ తెలిపారు. వీటి ద్వారా మొత్తం రూ. 1,04,17,082/- రూపాయలను బాధితులకు తిరిగి చెల్లించనున్నట్లు చెప్పారు. ఇది సైబర్ నేరాలపై కఠిన చర్యలతో పాటు బాధితుల ఆర్థిక పరిరక్షణకు పోలీస్ శాఖ ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ దర్యాప్తులో కీలకంగా వెలుగులోకి వచ్చిన కేసుల్లో ఒకటిగా రూ. 22.80 లక్షల జాబ్ ఫ్రాడ్ కేసు ఉందని డీసీపీ వివరించారు. ఈ కేసులో నిందితులు ఒక ప్రముఖ ఎంఎన్‌సీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి బాధితుడి నుంచి ₹20,80,007/- తీసుకున్నారని తెలిపారు. నిందితుడు జాబ్ పోర్టల్ ఉద్యోగిలాగా నటిస్తూ దరఖాస్తు, ఇంటర్వ్యూ, ప్రాసెసింగ్ ఛార్జీల పేరుతో డబ్బు వసూలు చేశారని, డబ్బు తీసుకున్న తర్వాత అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వకుండా, రీఫండ్ కూడా చేయకుండా పూర్తిగా స్పందించడం మానేశారని వివరించారు. ఈ కేసులో ప్రధాన నిర్వాహకుడైన పురుషోత్తం శర్మతో పాటు, కమిషన్ ఆధారంగా సిమ్ కార్డులు , బ్యాంకు ఖాతాలు సరఫరా చేసిన కుల్దీప్ కుమార్ ఏ సునీల్ అనే ఇద్దరు ఢిల్లీకి చెందిన నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు మోసపోయిన మొత్తాన్ని అనేక బ్యాంకు ఖాతాల కు మళ్లించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.ప్రజలు ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో సోషల్ మీడియా లేదా జాబ్ పోర్టల్స్ ద్వారా వచ్చే ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ టి. సాయి మనోహర్ సూచించారు. ఉద్యోగ దరఖాస్తులు, ఇంటర్వ్యూలు లేదా అపాయింట్‌మెంట్ల కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బు చెల్లించవద్దని, నిజమైన కంపెనీలు ముందస్తుగా రుసుములు వసూలు చేయవని గుర్తుంచుకోవాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు లేదా చెల్లింపులు చేసే ముందు అధికారిక వెబ్‌సైట్లు లేదా సంబంధిత హెచ్ఆర్ విభాగాల ద్వారా ధృవీకరణ చేసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని డీసీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ట్రాఫిక్ మార్షల్స్ భద్రతకు పెద్దపీట



అక్షర గళం, సైబరాబాద్ : ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాఫిక్ మార్షల్స్ భద్రతకు పెద్దపీట వేస్తూ సైబరాబాద్ పోలీసులు పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. శనివారం సైబరాబాద్ ఆడిటోరియం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రాఫిక్ మార్షల్స్ కు ఇన్సూరెన్స్ కార్డులను సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ మార్షల్స్ అందరికీ రూ. 1 లక్ష ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో, స్కోర్ 10 సంస్థ ఆర్థిక సహకారంతో ఇన్సూరెన్స్/బీమా సౌకర్యం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనల అమలులో ట్రాఫిక్ మార్షల్స్ పోలీసులతో సమానంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వారికి చట్టబద్ధమైన అధికారాలు, అధికారిక గుర్తింపు కల్పించామన్నారు. ట్రాఫిక్ లో విధులు నిర్వర్తిస్తున్న మార్షల్స్కు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆర్థిక భరోసా కల్పించాలానే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. బీమాతో పాటు మార్షల్స్ కు ప్రాథమిక చట్టపరమైన అంశాలు, "నో హాంకింగ్" వంటి అంశాలపై శిక్షణ నిర్వహిస్తామన్నారు. స్కోర్ 10 చైర్మన్ నారాయణ స్వరూప్ మాట్లాడుతూ సైబరాబాద్ ట్రాఫిక్ మార్షల్స్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. సామాజిక బాధ్యతతో ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ మార్షల్స్ రక్షణకు తమ సంస్థ స్కోర్ 10 తరుపున బీమా సౌకర్యం కల్పించడం సంతోషమన్నారు.మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా భద్రతను కాపాడడంలో ట్రాఫిక్ మార్షల్స్ పోలీస్ సిబ్బందితో సమానంగా అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ డిసిపి రంజన్ రతన్ కుమార్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీ హనుమంతరావు, ఎస్–సీఎస్‌సీ సీఈఓ నవేద్ ఖాన్ ట్రాఫిక్ మార్షల్స్ పాల్గొన్నారు.

# అంబీర్ చెరువు వద్ద అమ్ముకునే చిరువ్యాపారులకు
# అన్యాయం చేయకుండా అభివృద్ధి చేయాలి

### సిపిఐ బాచుపల్లి
### మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్



అక్షర గళం, కుత్బుల్లాపూర్ : ప్రగతి నగర్ అంబీర్ చెరువు వద్ద అమ్ముకునే చిరువ్యాపారులకు అన్యాయం చేయకుండా అభివృద్ధి చేయాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ రాజరికం కాదు అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ రాజు కాదు అని ఇది ప్రజాస్వామ్యం కనుక ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ప్రగతి నగర్ అంబీర్ చెరువులో గుర్రపు డెక్కలు పెరుగుతున్నాయి, దాని వల్ల దోమల బెడద అధికామౌతుందని, మొట్ట మొదట భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించిన తరువాత అందరు నిరసనలు చేయడం ప్రారంభించారన్నారు. నిజాంపేట్ బండారు లే ఔట్ మునిగినప్పుడు అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అంబీర్ చెరువును మినీ ట్యాంక్ బండ్ చేస్తాను అని చెప్పారు. అలాగే మూడు సార్లు గెలిచి ఎమ్మెల్యే వివేక్ కొంత మున్సిపల్ ఫండ్ పెట్టారు. ఆది టెండర్లకు జోబు నిండడానికి ఉపయోగపడింది. కానీ మినీ ట్యాంక్ బండ్ కాలేదు అని అన్నారు. ఒకవేళ ఆలా అంటే ఆది ప్రజాస్వామ్యం కాదు, అలాగే బీఆరెస్ ప్రభుత్వం సమయంలో అలాగే వారి ప్రభుత్వంలో చోటా మోటా లీడర్ల చిరు వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేసుకునే వారు అని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కొంత మంది చోటా లీడర్లు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇంచార్జ్ కోలన్ హనుమంతు రెడ్డి పేరు చెప్పి వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నారు.అని అన్నారు. ఆది చూసిన బీఆరెస్ లీడర్లు అంబీర్ చెరువును అడ్డం పెట్టుకొని అధికారులకు చిరు వ్యాపారుల పై పిర్యాదు చేస్తున్నారు అని అన్నారు. అంబీర్ చెరువుతో పాటు తుర్క చెరువు, పాపయ్య కుంట, కొత్త కుంట, బాచుపల్లి మండల పరిధిలోని అని చెరువులు కుంటలు కాపాడి అభివృద్ధి చేయాలనీ హైడ్రా కమిషనర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కానీ కొంత మంది వ్యక్తులు మేమే అభివృద్ధి చేస్తున్నాము అని కాలర్ ఎగరవేస్తున్నారు అని, ఒక వ్యక్తి చేస్తే ఏ పని కాదు అని అందరూ కలిసి చేస్తేనే అభివృద్ధి అవుతుంది అని అన్నారు రెక్కాడితే గాని డొక్కాడని చిరు వ్యాపారుల పొట్ట కొట్టకుండా వారికీ ప్రత్యన్యాయం సదుపాయాలు ఏర్పాటు చేసిన తరువాత వారిని అంబీర్ చెరువు నుండి ఖాళీ చేయించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అలాగే నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా వచ్చిన గోపి ఐఏఎస్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ కోసం కొంత స్థలాన్ని కావాలని బాచుపల్లి మండల తహసీల్దార్ కీ ఒక లెటర్ పెడితే నిజాంపేట్ సర్వే నెంబర్ 87లోని స్థలాన్ని ఇచ్చారు. దానికీ ఫెన్సింగ్ వేస్తుంటే నిజాంపేట్ స్థానిక ఎస్సీలు అట్టి స్థలం మాది అని కోర్టులో కేసు నడుస్తుంది అని చెప్పగా అట్టి స్థలంలో మార్కెట్ నిర్మాణ పని ఆపివేయడం జరిగిందన్నారు. అంబీర్ చెరువు కబ్జా కాకుండా కాపాడి, అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పుడు అదే స్థలం చేపలు అమ్మే వారికీ చూపిస్తున్నారు. ఇప్పుడు అధికారులు చూపెడుతున్న స్థలం గతంలో వెజ్ మార్కెట్ కు కేటాయించింది. దాని ఎదురుగా వున్న స్థలం నాన్ వెజ్ మార్కెట్కు కేటాయించిన్న స్థలం. అందులో చాలా కాలంగా అసాంఘిక కార్యక్రమలు అంటే మందు అమ్మే బెల్టు షాప్ నడిపిస్తున్నారు అని నిజాంపేట్లో అందరికి తెలిసిన విషయమే అయినా అధికారులు పట్టించుకోరు అని అన్నారు. వెంటనే చిరు వ్యాపారులకు న్యాయం చేయాలనీ లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమలు చేస్తాము అని హేచ్చరించారు.



# విజయవంతంగా భవ్య ఆధ్యాత్మిక కార్యక్రమం

అక్షర గళం, మేడ్చల్: మేడ్చల్ సమీపంలోని బండ మైలారం గ్రామం వద్ద ఉన్న దక్షిణ బద్రీనాథ్ ఆలయంలో ఉత్తరాఖండ్ కళ్యాణకారి సంస్థ ఆధ్వర్యంలో భవ్య ఆధ్యాత్మిక కార్యక్రమం శనివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పన్నెండు జ్యోతిర్లింగాలలో మొదటిదైన సోమనాథ్ జ్యోతిర్లింగం యొక్క పవిత్ర శకలం, మా యమునా చాడీని ప్రతిష్టించారు.మహారాజ్ జీ పవిత్ర సందర్శన సందర్భంగా, భక్తులు చార్ ధామ్ యొక్క గొప్పతనం , సోమనాథ్ శివలింగ శకలం యొక్క దైవిక ప్రాముఖ్యత గురించి ప్రవచనాలను విన్నారు. ఈ సోమనాథ్ శివలింగ శకలంలో శివుని దైవిక చైతన్యం, కరుణా శక్తి, అనుగ్రహం నిరంతరం నెలకొని ఉంటాయని విశ్వసిస్తారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సురేష్ సెమ్వాల్, అధ్యక్షుడు, ఉత్తరాఖండ్ చార్ ధామ్ తీర్థ పురోహిత్ మహాపంచాయత్ , ఫైవ్ గంగోత్రి టెంపుల్ కమిటీ,డా. బ్రజేష్ సట్టి, జనరల్ సెక్రటరీ, చార్ ధామ్ తీర్థ పురోహిత్ మహాపంచాయత్ మరియు ఫైవ్ గంగోత్రి టెంపుల్ కమిటీ,ఎం. శ్రీలత శోభనా రెడ్డి, డిప్యూటీ మేయర్, జిహెచ్ఎంసి, తెలంగాణ ఆలయ కమిటీ సభ్యులు విక్రమ్, రికేష్ పెట్వాల్, రాజేష్ బడోని, స్మితా బడోని, అనిరుధ్ బడోని, రుద్ర బడోని, అనిల్ సింగ్, అనిల్ బండారి, రోషన్ సింగ్, విజయ్ లసిహ్యాల్ తదితరులు పాల్గొన్నారు.

# తీవ్రమైన కేసుల్లో శిక్షా శాతం మరింత పెరగాలి

### సైబరాబాద్
### పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్



అక్షర గళం, గచ్చిబౌలి: పోక్సో హత్యలు, ఆర్థిక నేరాలు, చైన్ స్నాచింగ్ వంటి తీవ్రమైన కేసుల్లో శిక్షా శాతం మరింత పెరగాలి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని కమిషనరేట్ కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి గాను 'రివార్డ్ మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా నేర నిరూపణలో కీలక పాత్ర పోషించిన పోలీస్ అధికారులు, ప్రాసిక్యూటర్లను ఆయన అభినందించి రివార్డులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమినల్ కేసుల్లో సరైన ఆధారాలతో నేరాన్ని నిరూపించి, దోషులకు శిక్ష పడేలా చేసినప్పుడే బాధితులకు నిజమైన న్యాయం జరుగుతుందన్నారు. గత ఏడాది అక్టోబరు 1 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు మొత్తం 12 కీలక కేసుల్లో నిందితులకు ఏడేళ్ల అంత కంటే ఎక్కువ కాలం జైలు శిక్షలు పడ్డాయని సీపీ తెలిపారు. ఇందులో కీలక పాత్ర పోషించిన 15 మంది పీపీ/ఏపీపీలు, 17 మంది విచారణాధికారులు (IO\T), 19 మంది కోర్ట్ డ్యూటీ ఆఫీసర్లు, 13 మంది లైజన్ ఆఫీసర్లు.. ఇలా మొత్తం 64 మందికి సీపీ ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. దర్యాప్తులో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలు కీలక పాత్ర పోషిస్తాయి. చిన్న పొరపాటు జరిగినా కేసు బలహీనపడే ప్రమాదం ఉంది కాబట్టి, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. పది, ఇరవై ఏళ్ల శిక్షలు లేదా జీవిత ఖైదు పడిందంటే అది దర్యాప్తు, ప్రాసిక్యూషన్ బృందాల సమష్టి కృషి ఫలితమే" అని కొనియాడారు. కేసుల పురోగతిపై జోనల్ డీసీపీలు ప్రతి నెలా పీపీలతో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పోలీస్ శాఖ, ప్రాసిక్యూషన్ విభాగం మధ్య సమన్వయం ఉన్నప్పుడే నేరస్తులకు శిక్షలు పడతాయని తెలిపారు. నిజాయితీగా పనిచేసి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శ్రీమతి పి. మంజులా దేవి, డీసీపీలు శ్రీనివాస్, రితిరాజ్, శేషాద్రిని రెడ్డి, టి. అన్నపూర్ణ, ముత్యం రెడ్డి, వై.వి.ఎస్. సుధీంద్ర, శోభన్ కుమార్, రంజన్ రతన్ కుమార్, సృజన కర్నం, సంజీవ్ ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# కార్మికుల భద్రత, సంక్షేమానికి అన్ని విభాగాలు సమన్వయంతో కలిసి పనిచేయాలి నార్సింగి ఏసీపీ రమణ గౌడ్

అక్షర గళం, నార్సింగ్ : . కార్మికుల భద్రత, సంక్షేమానికి అన్ని విభాగాలు సమన్వయంతో కలిసి పనిచేయాలని నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ సూచించారు నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికుల సంక్షేమం, భద్రతను దృష్టిలో ఉంచుకొని కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మైహోమ్ సాయుక్ క్లబ్ హౌస్ వద్ద శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ మాట్లాడుతూ నిర్మాణ ప్రాంగణాల్లో పనిచేసే కార్మికుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు.నిర్మాణాల వద్ద నిర్దేశిత చట్టబద్ధమైన విధానాలు, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు. కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, హక్కులపై వారికి వివరించారు.కొల్లూరు ఎస్హెచ్ఓ గణేష్ పటేల్ మాట్లాడుతూ ప్రతీ కార్మికుడికి సురక్షితమైన పని వాతావరణం కల్పించడం కాంట్రాక్టర్ల బాధ్యతన్నారు. ఈ విషయంలో పోలీస్ శాఖ నుండి పూర్తి సహకారం ఉంటుందన్నారు.ఈ సమావేశంలో కొల్లూరు ఇన్ స్పెక్టర్ గణేష్ పటేల్, కొల్లూరు పోలీస్ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు, హెచ్ఆర్, సెక్యూరిటీ మేనేజర్లు, కాంట్రాక్టర్లు, 500 మంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు.